# సాక్షి అనంతపురం


మంగళవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2023





**చీనీ టన్ను రూ.35 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.20**

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.




జిల్లా అంతటా సోమవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్సీగా మంగమ్మ ఏకగ్రీవం



డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ మంగమ్మ చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రజాప్రతినిధులు

**అనంతపురం అర్బన్:** ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్.మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ కేతన్‌గార్గ్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగమ్మకు డిక్లరేషన్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలమూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి పాల్గొన్నారు.

### నేడు రైతుల ఖాతాల్లోకి 'ఇన్‌పుట్' భరోసా



**అనంతపురం అగ్రికల్చర్:** వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకంలో భాగంగా 4వ ఏడాది మూడో విడత కింద రూ.2వేలు పెట్టుబడి సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లాకు సంబంధించి అర్హత కలిగిన 2,83,229 రైతు కుటుంబాలకు రూ.59.11 కోట్లు విడుదల కానున్నట్లు పేర్కొన్నారు. అలాగే 'మాండూస్' తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి 241 మంది రైతులకు రూ.26.70 లక్షల ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) కూడా విడుదల చేయనున్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో మెగా చెక్ విడుదల చేస్తారని పేర్కొన్నారు.

### బీటెక్, బీఫార్మసీ ఫలితాల విడుదల



**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ (ఆర్-19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-15) సప్లిమెంటరీ, ప్రీ-పీహెచ్‌డీ, ఎంఎస్, ఎంఫిల్ (ఆర్-9 నుంచి ఆర్-18) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి సోమవారం తెలిపారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలని సూచించారు.

# పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు తలారి రంగయ్య, మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



పాల్గొన్న ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మహమ్మద్ ఇక్బాల్, మంగమ్మ, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

- పార్టీ శ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని అలెగ్జాండర్ ఫంక్షన్ హాలులో సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో మంత్రి దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని.. విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, రెడ్డప్ప, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మహమ్మద్ ఇక్బాల్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, బీసీ రమేష్‌గౌడ్, వీఆర్ రామిరెడ్డి, ఆయా నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా నూతన పరిచయం



ఎమ్మెల్సీ మంగమ్మను సన్మానించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ప్రజాప్రతినిధులు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నూతన జిల్లా అధ్యక్షుల పరిచయ కార్యక్రమం సోమవారం అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్‌హాలులో అట్టహాసంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షత వహించారు. మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నూతన జిల్లా అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి(యువజన విభాగం), బిందెల శ్రీదేవి ( మహిళా విభాగం), నారాయణ (రైతు విభాగం), వీరన్న (బీసీ సెల్), ఎగ్గుల శ్రీనివాసులు (ఎస్సీ సెల్), సాకే రామకృష్ణ (ఎస్టీ సెల్), సైపుల్లా బేగ్ (మైనార్టీ సెల్), కొర్రపాడు హుస్సేన్‌పీరా (వైఎస్సార్‌టీయూసీ), పాలాక్షిరెడ్డి (వాణిజ్య విభాగం), సోమశేఖర్ (కల్చరల్ విభాగం), తిమ్మరాజు (వైఎస్సార్ సేవాదళ్), ఈశ్వరరెడ్డి (పబ్లిసిటీ వింగ్), బసవరాజు (పంచాయతీరాజ్ వింగ్), గౌని లక్ష్మికాంతరెడ్డి (గ్రీవెన్స్ సెల్), రంగనాథరెడ్డి (వికలాంగుల విభాగం), సి.నాగప్ప (చేనేత విభాగం), సందీప్‌రెడ్డి (ఐటీ వింగ్), సుధీర్‌రెడ్డి (విద్యార్థి విభాగం), హరీష్ కుమార్‌రెడ్డి (డాక్టర్స్ వింగ్), మండ్ల సుధాకర్(క్రిస్టియన్ మైనార్టీ సెల్)ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. అనంతరం వీరిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. అదే విధంగా బీసీ రమేష్‌గౌడ్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్మానించారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీకి మీరే కళ్లు, చెవులు అని, పార్టీ బలోపేతానికి, అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కేవీ రమణ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, కువైట్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

**మంగమ్మకు మంత్రి అభినందనలు**

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మంగమ్మకు రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. అందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మంగమ్మకు అవకాశం వచ్చిందన్నారు.

## బరిలో 61 మంది

- పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది పోటీ
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరులో 12 మంది

**అనంతపురం అర్బన్:** పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 61 మంది నిలిచారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీకి 51 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 14 మంది మిగిలారు. సోమవారం కలెక్టరేట్‌లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించారు. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ నుంచి ఇద్దరు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నుంచి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది పోటీ పడుతున్నారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో...**

వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి (టీడీపీ), రాఘవేంద్ర నగురూరు (బీజేపీ), ఎస్.మల్లికార్జున (ఆల్ ఇండియా కిసాన్ జనతాపార్టీ)తో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ఎ.జలాలుద్దీన్ మునీర్, టి.అశ్వర్థరెడ్డి, ఎ.అయ్యస్వామి, కె.నాగరాజు, కాంతి జాన్‌వెస్లీ, కాంతి భువన ఏకదాసరెడ్డి, కె.సూర్యశేఖరరెడ్డి, కె.లక్ష్మీనారాయణ, కె.హరి వెంకటరమణ, జి.వెంకటరమణ, జి.మల్లేశ్వరెడ్డి, జి.అలీహుసేన్, జి.మారుతీప్రసాద్, టి.రామన్న, ఎన్.రమేశ్ నాయుడు, ఎన్.నరసింహ, పి.పవన్‌కుమార్, పి.చంద్రశేఖర్, పి.రవికుమార్, పి.నాగరాజు, పి.నరేంద్రబాబు, బి.మైసూరారెడ్డి, బి.రమేష్, బి.మారుతి గోవిందప్రసాద్, బోరంపల్లి ఆంజనేయులు, బి.ఓంకారయ్య, భానుప్రకాష్ రెడ్డి, డి.ఎం.మద్దిలేటి, మహమ్మద్ అక్బర్ హుసేన్, అమానుల్లా, గంగులప్ప, చంద్రప్ప, ఆర్.శివప్రసాద్, రాజన్న, ఎం.వి.రామచంద్రుడు, వెంకటేష్ వడ్డే, వెన్నపూస భరత్‌రెడ్డి, వెన్నపూస వెంకటరమణ కృష్ణారెడ్డి, షేక్ ఇమాం వలి, షేక్ గైబువలి, ఎస్.అమృత్ కుమార్, ఎస్.జయకాంత్, ఎస్.కృష్ణమూర్తి, ఎస్.జనార్దనరాజు, హిమబిందు.టి పోటీలో నిలిచారు.

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు..**

ఎం.వి.రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ మద్దతు), అనిల్‌కుమార్‌రెడ్డి.కె, ఒంటేరు శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి (పీడీఎఫ్ మద్దతు), సి.వెంకటప్రసాద్‌రెడ్డి, సి.వరలక్ష్మి, జి.వి.నారాయణరెడ్డి, పి.గంగాధర్‌రెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసరావు, డి.రామశేషయ్య, ఎస్.మాధవరావు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీపడుతున్నారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

- అధికారులకు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుల ఆదేశం



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్‌కు వివరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

**అనంతపురం అర్బన్:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్ నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అంశంపై పరిశీలకులు సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్ల గురించి పరిశీలకులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ వివరించారు. అనంతరం పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో చిన్నపొరపాట్లకు కూడా తావీయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారా? ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారా? అనేది నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందే పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలు మధుసూదన్, నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

**పటిష్ట చర్యలు :** ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహణకు 579 మంది సిబ్బందిని నియమించామన్నారు. మండల, మునిసిపల్ స్థాయిల్లో ఎంసీసీ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది, శిక్షణ, సామగ్రి, బ్యాలెట్ పేపర్ ముద్రణ, రవాణా, కంప్యూటరీకరణ, సైబర్ సెక్యూరిటీ, స్వీప్ కార్యకలాపాలు, బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపునకు కేంద్రాలు, సూక్ష్మ పరిశీలకులు, వెబ్‌కాస్టింగ్ తదితర కార్యక్రమాల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించామన్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు :** ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎస్పీ ఫకీరప్ప తెలిపారు. 33 రూట్లలో మొబైల్ పార్టీలను, 54 లొకేషన్లలో ఫ్లయింగ్ బృందాలను నియమించామన్నారు. 27 చెక్‌పోస్టులను, 20 పికెట్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అదనపు సిబ్బంది కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

**హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల గురించి ఆయన సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వెల్లడించారు. మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు 3,30,124 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 28,148 మంది ఉన్నారని వివరించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 84 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సిబ్బందికి రెండు దఫాలు శిక్షణ ఇస్తామన్నారు. పోలింగ్ పరిశీలనకు సూక్ష్మ పరిశీలకులను నియమించామని చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలని అనే అంశంపై ఓటర్లకు మార్చి మూడో తేదీన మండలస్థాయిలో, ఆరో తేదీన గ్రామ పంచాయతీ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

**11న ప్రచారం ముగించాలి :** అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే మార్చి 11వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా ముగించాల్సి ఉంటుందని రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ తెలిపారు. ప్రచారం, వాహనాలు, ప్రకటనల అనుమతి కోసం కలెక్టరేట్‌లో సింగిల్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఖర్చు వివరాలను ఎక్స్‌పెండేచర్ కమిటీకి అందజేయాలని సూచించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** జిల్లా పోలీసు శాఖ ఇస్తున్న 'రియల్ టైం ఈవెంట్స్ ఉచిత శిక్షణ'లో భాగంగా 300 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ మైదానంలో అభ్యర్థులకు ఎత్తు, బరువు, ఛాతీ (పురుష అభ్యర్థులు) కొలతలు తీసుకున్నారు. అనంతరం 100 మీటర్లు, 1,600 మీటర్లతో పాటు లాంగ్ జంప్ ఈవెంట్స్‌కు ఉచిత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, రమేష్ నాయక్, పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్ర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి వివాహిత ఆత్మహత్య

**రాప్తాడు:** స్థానిక పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చాకలి లక్ష్మి (37) సోమవారం పండమేరు రైల్వే బ్రిడ్జిపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన చాకలి రంగడు, లక్ష్మి కొన్నేళ్ల క్రితం వలస వచ్చి ఇందిరమ్మ కాలనీలో నివాసమేర్పరుచుకున్నారు. కుల వృత్తితో జీవనం సాగించేవారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై ధర్మవరం రైల్వే ఎస్ఐ గోపీకుమార్ దర్యాప్తు చేపట్టారు.

# మూఢనమ్మకాలపై చైతన్య బావుటా

- సైన్సు ప్రయోగాలకు పెరుగుతున్న ఆదరణ


**సందర్భం: నేడు జాతీయ సైన్సు దినోత్సవం**



**అనంతపురం/కల్చరల్:** మూఢ నమ్మకాలు.. అంధ విశ్వాసాలు ఎంతలా మనిషిని దిగజారుస్తున్నాయో రెండేళ్ల క్రితం బాలికా దినోత్సవం రోజు మదనపల్లిలో చోటు చేసుకున్న ఘటన అద్దం పడుతోంది. ఉన్నత విద్యావంతులు.. ప్రొఫెసర్లుగా జీవితంలో స్థిరపడిన దంపతులు మూఢ నమ్మకంతో తమ ఇద్దరు కుమార్తెలను దారుణంగా హతమార్చిన ఆ ఘటన యావత్ దేశంలోనే కలకలం సృష్టించింది. శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్లనే ఇంతటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయనేది అక్షర సత్యం. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్సును విస్తృత ప్రచారం చేసేందుకు పలు సంస్థలు నిరంతరం శ్రమిస్తున్నాయి. సైన్సు చేస్తున్న వింతలు, విశేషాలపై చైతన్యం కలిగేలా సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కారమైన ఫిబ్రవరి 28న 'జాతీయ సైన్సు దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. భారతదేశ కీర్తిని ఇనుమడింపజేసిన శాస్త్రవేత్త రామన్ స్ఫూర్తిని అందిపుచ్చుకుని చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న కొందరి ప్రయాణంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

### అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా..

నాలుగు దశాబ్దాల పాటూ విద్య సంస్థల్లో సైన్సుపై ప్రచారం గావిస్తూ వందల కొద్ది ప్రదర్శనలతో మహాత్యాలకు వ్యతిరేకంగా జనంలో చైతన్యం తీసుకువచ్చిన వారిలో తరిమెల అమరనాథరెడ్డి ప్రముఖుడు. గాలి నుంచి విభూది తీసివ్వడం.. నిప్పులపై నవ్వుతూ నడవడం.. వేడి నూనెలో చేయిపెట్టి హాయిగా బజ్జీలు తీసుకుని తినడం వంటివి చేసి చూపించి ఇవన్నీ గారడీ విద్య లేనని నిరూపించారు. భక్తి పేరుతో చేస్తున్న కొందరు స్వామీజీలు చేస్తున్న మోసాల్లో ఇవన్నీ చోటు చేసుకుంటాయని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ శాస్త్ర విజ్ఞానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. సిలోన్‌కు చెందిన అబ్రహాం కోవూరు, ప్రఖ్యాత నాస్తికవాది ప్రేమానంద్ (కేరళ) స్ఫూర్తితో మానవతా సంస్థ ద్వారా నిరంతరం సైన్సుపై ప్రచారం చేస్తున్నారు.



విభూతి రాల్చే విధానంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న తరిమెల అమరనాథరెడ్డి (ఫైల్)

### ఒళ్లు గగుర్పొడిచే మ్యాజిక్కులు..



విద్యార్థి తలపై నిప్పు రాజేసి టీ కాస్తున్న శంకరశివరావు (ఫైల్)

జనవిజ్ఞాన వేదిక జాతీయ మ్యాజిక్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న శంకరశివరావు సైన్సు ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు మూఢ నమ్మకాలను పారదోలేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈయన ప్రదర్శనలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. ఏ ఆధారం లేకుండా అమ్మాయిని గాలిలో నిలబెట్టడం, నాలుకపై శూలాన్ని గుచ్చుకోవడం, కళ్లకు గంతలు కట్టుకుని ట్రాఫిక్‌లో ద్విచక్రవాహనాన్ని వేగంగా నడపడం, నిమ్మకాయలు.. టెంకాయల నుంచి రక్తాన్ని తెప్పించడం, ఎగిసి పడుతున్న మంటల్లో నడవడం, నోటి నుంచి నిప్పు రాల్చడం.. తదితర అంశాలను ప్రదర్శించినప్పుడు ఆయనను మహిమాన్వితుడిగా గ్రామీణులు భావించేవారు. అయితే ఈ అద్భుతాల వెనుక దాగి ఉన్న సైన్స్ రహస్యాన్ని వివరించి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

### జాతీయ సైన్స్ దినోత్సవం ఆవిర్భావం ఇలా..

చంద్రశేఖర్ వెంకటరామన్ (సీవీ రామన్) 1888, నవంబరు 7న తమిళనాడులోని తిరుచినాపల్లి సమీపంలోని అయ్యన్ పెటాయ్ గ్రామంలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. మధ్య తరగతి కుటుంబం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. విశాఖపట్నంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన సి.వి.రామన్ చిన్నప్పటి నుంచి విజ్ఞాన శాస్త్ర విషయాలపై అమితమైన ఆసక్తి కనబరిచేవారు. తండ్రి భౌతిక శాస్త్ర అధ్యాపకులవడంతో ఆ దిశగా అతనిలో మరింత ఆసక్తి పెరిగింది. తన 12వ ఏట మెట్రిక్యులేషన్ (ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి) పూర్తి చేసిన రామన్.. 1907లో ఎంఎస్సీ (ఫిజిక్స్)లో యూనివర్సిటీకి ప్రథముడిగా నిలిచారు. తన 18వ ఏటనే కాంతికి సంబంధించిన ధర్మాలపై ఆయన సాగించిన పరిశోధనా వ్యాసం లండన్ నుంచి వెలువడే ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమైంది. చివరి వరకు భారతదేశంలో సైన్స్ అభివృద్ధికి పాటుపడ్డ ఆ మహనీయుడు 1970 నవంబర్ 20న భౌతికంగా కన్నుమూశారు. అప్పటి నుంచి 1928లో ఫిబ్రవరి 28న ఈయన రామన్ ఎఫెక్టును కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని భారతదేశంలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఆయనను చిరంజీవిగా మనమధ్యే నిలిపేలా కొన్ని సంస్థలు ఆయన పేరు మీద టాలెంట్ టెస్టులు, సైన్స్‌కు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతూ వచ్చాయి.

### నేడు వాడవాడలా సైన్సు దినోత్సవం

జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలు చోట్ల సైన్సు ప్రచార కార్యక్రమాలు సందడిగా జరగనున్నాయి. రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం సైన్సు డే ను సృజనోత్సవం పేరిట స్ఫూర్తిదాయకంగా సైన్సు సెంటర్ ద్వారా నిర్వహించారు. అదే కోవలో ఈసారి కూడా సైన్సు దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేస్తూ యూనివర్సిటీలు, కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో సైన్సు ఫేర్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రంగనాయకులు (ఫైల్)

**యాడికి:** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని చందన గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు కుమారుడు రంగనాయకులు(18), ఓ కుమార్తె ఉన్నారు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రంగనాయకులు బేల్దారి పనులతో తండ్రికి చేదోడుగా ఉండేవాడు. ఆదివారం రాత్రి గొర్రెల మంద వద్ద పడుకున్న రంగనాయకులు.. మంద నుంచి కొన్ని గొర్రెలు తప్పి పోయినట్లు గుర్తించాడు. దీంతో సోమవారం వేకువజాము 2 గంటలకు బంధువులు గంగాధర్, అశోక్‌తో కలసి గొర్రెల కోసం గాలిస్తూ పిన్నేపల్లి గ్రామం వద్ద రైతు పర్వతాలు మొక్కజొన్న పంటకు రక్షణ వేసిన విద్యుత్ తీగలను తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

## 'పోలీసు స్పందన'కు 90 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

**అనంతపురం శ్రీకంఠం సర్కిల్:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 90 వినతులు అందాయి. బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ డాక్టర్ ఫక్కరప్ప స్వయంగా స్వీకరించి, సమస్య తీవ్రత తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. అనంతరం గత ఏడు రోజుల వ్యవధిలో చాట్‌బాట్ సేవల ద్వారా పోలీసులు రికవరీ చేసిన 123 సెల్‌ఫోన్లను సంబంధీకులకు అందజేశారు. ఇందులో ఏడు ఫోన్లను ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారికి కొరియర్ ద్వారా పంపారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకరయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



# రేపటి నుంచి 'గాలికుంటు' టీకాలు

- నెలరోజులపాటు ప్రత్యేక కార్యక్రమం

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యాప్తంగా మార్చి ఒకటో తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీసెస్–ఎఫ్ఎండీ) నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం, అనంతపురం డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి సోమవారం 'సాక్షి'కి తెలిపారు. నెలరోజులపాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 4.09 లక్షల ఆవులు, గేదెలు, ఎద్దులకు టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. అంటువ్యాధి అయిన ఇది సోకితే పశువుల్లో మరణాలు తక్కువైనా బలహీనపడటం, పశువుల్లో పాల ఉత్పత్తులు తగ్గిపోవడం జరుగుతాయన్నారు. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం, నోరు, నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేత మేయకపోవడం, చొంగకార్చడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. గర్భంతో ఉన్న పశువులకు అబార్షన్ కావడం, ఒక్కోసారి పొదుగువాపు వ్యాధి సోకడం జరుగుతుందన్నారు. బ్యాక్టీరియా చేరి చీము కారడం వల్ల ఇతరత్రా రోగాలు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి సోకిన పశువుల గిట్టలు, పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయడం, బోరోగ్లిజరిన్ పూత రాయడం, ఈగలు వాలకుండా వేపనూనె, నిమ్మెంట్, లారాజెంట్ లాంటి మందులు వాడాల్సి ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారి సిఫారసు మేరకు యాంటీ బయాటిక్ మందులు తాపించాలని సూచించారు. వ్యాధి సోకిన పశువులకు రోజూ 50 గ్రాములు అయోడైజ్డ్ ఉప్పు దాణాతో కలిపి ఇస్తే కొంత ఉపశమనం ఉంటుందన్నారు. 30 గ్రాములు ఎముకలపొడి పచ్చిమేతతో కలిపి రోజూ ఇస్తే త్వరగా కోలుకుంటాయన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించడం కన్నా రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా మార్చి ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో తమ పశువులు, గేదెలు, ఎద్దులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు.



గాలికుంటు వ్యాధి కారణంగా బొబ్బలు ఏర్పడి నోటి నుంచి చొంగ వస్తున్న దృశ్యం

## ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**అనంతపురం సిటీ:** శాసన మండలి(ఎమ్మెల్సీ) ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి మార్చి 1న శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి సోమవారం తెలిపారు. బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేసే అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గాను మండల, మున్సిపల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో నిర్వహించే శిక్షణ తరగతులకు పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

## సాంకేతిక విద్యతో సమాన అవకాశాలు

- టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగరాణి

**అనంతపురం సిటీ:** పాలిటెక్నిక్ లాంటి సాంకేతిక విద్యతో సమాన అవకాశాలు ఉంటాయని ఈ కోర్సుల్లో అమ్మాయిల ప్రవేశాలు మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి సూచించారు. అమ్మాయిలను అన్ని రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, వారి విద్యాభివృద్ధి కోసం కోట్లకు కోట్లు ఖర్చు పెడుతోందని వివరించారు. అమరావతి నుంచి సోమవారం ఆమె వర్చువల్ విధానంలో స్థానిక అధికారులతో మాట్లాడారు. పాలిటెక్నిక్ తరువాత ఇంజినీరింగ్ కోర్సులు చేయడంతో పాటు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయనే అంశంపై విద్యార్థినులతో పాటు తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. అమ్మాయిలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆర్టీటీ ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ చర్చించారు. ప్రొఫెసర్ నాగభూషణరాజు, ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దారిదోపిడీ ముఠా సభ్యుడి అరెస్ట్

**తాడిపత్రి:** లారీ డ్రైవర్లను కత్తులతో బెదిరించి నగదు అపహరించుకెళుతున్న దారిదోపిడీ ముఠాలోని ఓ సభ్యుడు పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలను సోమవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడిపత్రి డీఎస్పీ చైతన్య వెల్లడించారు. ఇటీవల తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో లారీ డ్రైవర్లను దోపిడీ చేసి ఉడాయించిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేశారు. తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డులో ఉన్న ఆర్టీటీ కాలనీ, టిడ్కో గృహాల సమీపంలో సోమవారం ఉదయం మోడికెర గొల్ల రమేష్ అలియాస్ కిన్నర్ జోగిని సీఐ చిన్న పెద్దయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ అదుపులోకి తీసుకున్నారు. విచారణలో లారీ డ్రైవర్లను దోపిడీ చేసినట్లుగా నిందితుడు అంగీకరించాడు. కాగా, నిందితుడు కర్ణాటకలోని సింధనూరు తాలూకా అంబావత్ గ్రామానికి చెందిన వాడని, బెంగళూరులోని లక్ష్మీపుర క్రాస్‌లో నివాసముంటున్నట్లుగా తేలింది. నిందితుడి నుంచి కొడవలి, ద్విచక్ర వాహనంతో పాటు కొంత నగదు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## మద్యం అక్రమ రవాణాదారుల అరెస్ట్

**ధర్మవరం అర్బన్:** మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ధర్మవరంలోని బోయ వీధికి చెందిన వెంకటేష్ నాయక్, ముత్యాలు ఓ సంచిలో రూ.2,880 విలువైన 18 ఏపీ మద్యం బాటిళ్లను రవాణ చేస్తుండగా పట్టుబడ్డారు. స్థానికంగానే ఓ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి రాత్రి సమయంలో ఇళ్ల వద్ద విక్రయించేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మద్యం కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## చెరుకు తోట దగ్ధం

- రూ.25 లక్షల నష్టం



**లేపాక్షి:** ఏడాది పాటు కష్టపడి పెంచిన చెరుకు తోట కళ్ల ముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. వివరాలు.. లేపాక్షి మండలం బిసలమానేపల్లికి చెందిన రైతు బి.ఆర్.వేణుగోపాలరెడ్డి.. ఓబుళాపురం గ్రామ సమీపంలో తనకున్న ఏడు ఎకరాలకు పైగా పొలంలో గత ఏడాది చెరుకు పంట సాగుచేపట్టాడు. పంట ఏపుగా పెరిగి దిగుబడి ఆశాజనకంగా ఉంది. 20 రోజుల క్రితం చెరుకు గానుగను ఏర్పాటు చేసి బెల్లం తయారీ చేపట్టాడు. సోమవారం ఉదయం బెల్లం తయారు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి చెరుకు తోటను చుట్టుముట్టాయి. బలమైన గాలులు వీస్తుండడంతో చూస్తుండగానే ఐదు ఎకరాల్లో పంటను మంటలు చుట్టుముట్టాయి. చుట్టుపక్కల రైతులు, కూలీలు, పశువులు కాపరులు స్పందించి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునేలోపు పంట మొత్తం తగులబడి పోయింది. దీంతో రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.

## భూమికి చేరువలో బుల్లి విమానం

**బొమ్మనహాళ్:** భూమికి అతి చేరువగా ఓ బుల్లి విమానం (208 కార్వాన్) చక్కర్లు కొట్టి గ్రామీణుల్లో ఉత్కంఠకు తెరలేపుతోంది. వారం రోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో బొమ్మనహాళ్ మండలంలోని మైలాపురం, ఏలంజి, కొత్తూరు, కానాపురం, కొలగానహళ్లి, కృష్ణాపురం, లింగదహాళ్, ఉద్దేహాళ్, ఉంతకల్లు, ఎల్‌బీనగర్ గ్రామాల్లో డి.హీరేహాళ్ మండలాల్లోని గోడిశలపల్లి, నాగలాపురం, తిమ్మలాపురం, సోమలాపురం, మల్లికేతి తదితర గ్రామాల్లో విమానం చక్కర్లు కొడుతోంది. తొలుత సాంకేతిక లోపం తలెత్తిందేమోనని ప్రజలు భావించారు. అయితే వారం రోజులుగా కొంచెం ఎత్తులో చక్కర్లు కొట్టడుతుండటంతో ప్రైవేట్ కంపెనీలేమైనా సర్వే చేపట్టాయా, లేదా ప్రభుత్వమే సర్వే చేస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మామిడి మొక్కలు అగ్నికి ఆహుతి

**కనగానపల్లి:** మండలంలోని బాలేపాళ్యం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో రైతు అనసూయమ్మ సాగు చేస్తున్న 150 మామిడి మొక్కలు కాలిపోయాయి. మూడేళ్ల క్రితం తనకున్న ఐదెకరాల మెట్ట పొలంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 350 మామిడి మొక్కలను ఆమె నాటి, పెంచి పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి పొలానికి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు రాజేయడంతో మంటలు వ్యాపించి 150 మామిడి మొక్కలతో పాటు డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత మహిళా రైతు వాపోయారు.



# వైభవం.. అడ్డపల్లకీ ఉత్సవం

**ఉరవకొండ:** ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గవిమఠం పీఠాధిపతి అడ్డపల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా సాగింది. స్థానిక వెలిగొండ రహదారి వద్ద ఉన్న విడిది మంటపంలో పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామికి మఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ.. పాదపూజ చేసి బంగారు గండ పెండారాన్ని కాలికి తొడిగారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన అడ్డపల్లకీలో కూర్చొబెట్టి, మేళతాళాలు, కళాకారుల నృత్యప్రదర్శనల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం సిబ్బంది శంకర్, నారాయణస్వామి, గోపి, మధు పాల్గొన్నారు.



అడ్డపల్లకీలో ఊరేగుతున్న గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి

## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమావేశం

**రాప్తాడురూరల్:** రుద్రంపేట సమీపంలోని వాల్మీకి భవనంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాప్తాడు నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ మండల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ కమిటీల సభ్యులు హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### నేడు వేలంపాట

**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థలో మంగళవారం ఉదయం 11 గంటలకు సంత మార్కెట్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న వేలంపాట నిర్వహించగా, పోటీదారులు ఆసక్తి చూపకపోవడంతో వేలం పాట వాయిదా వేసిన విషయం విదితమే.

### నేడు జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

**రాప్తాడు:** అయ్యవారిపల్లిలో ఎర్రితాత స్వామి ఉట్ల పరుషను పురస్కరించుకొని కాల్వ గొంచివారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం 8 గంటలకు దేశీయ ఎద్దులతో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు అందిస్తామన్నారు. వివరాలకు సెల్: 98667 66576, 97043 29378లో సంప్రదించాలన్నారు.

### ఘనంగా సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి

**అనంతపురం:** హౌసింగ్‌బోర్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అత్యుత్తమ ప్రదర్శనలు రూపకల్పన చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతు చేయించాలి

**అనంతపురం క్రైం:** నగరంలోని 10వ డివిజన్ ఫెర్రర్ కాలనీలోని ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతు చేయించాలని డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీదేవి, నాయకులు గంగాధర్ కమిషనర్ భాగ్యలక్ష్మిని కోరారు. సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. భవానీనగర్, ఎస్కేడీ నగర్‌లో ఉదయం 6 గంటలకే నీటి సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

### పట్నం శివప్రసాద్‌కు నృత్యకిరణం అవార్డు



పట్నం శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** హైదరాబాద్‌కు చెందిన సంచలన స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నృత్యశిక్షకుడు పట్నం శివప్రసాద్‌ను నృత్యకిరణం అవార్డుతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన శిష్యబృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు పద్మప్రియ, జ్యోత్స్న, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

### పరికరాల అందజేత

**కనగానపల్లి:** స్థానిక భవిత విద్యా కేంద్రం విద్యార్థులకు అధికారులు దివ్యాంగుల పరికరాలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఎంఈఓ అరుణమ్మ చేతులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు జగదీశ్వర్, లలితమ్మ పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి పంపిణీ

**కనగానపల్లి:** స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో దాతల సహకారంతో విద్యార్థులకు క్రీడా సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఆర్థిక సాయం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ నల్లప్ప, అంకె అశోక్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రభాకర్, పాఠశాల కమిటీ చైర్మన్ విశ్వనాథ్, హెచ్‌ఎం లక్ష్మీదేవి, పీడీ రమేష్, స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుసేన్‌పీరా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్

## 'అనుబంధ' అధ్యక్షులకు సన్మానం


వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల పరిచయ కార్యక్రమం సోమవారం అనంతపురం గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై.. అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను సన్మానించారు.

– అనంతపురం సప్తగిరి సర్కిల్:



విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు భోగే హరీష్‌కుమార్‌రెడ్డి

## ఎమ్మెల్యేను కలిసిన 'అనుబంధ' అధ్యక్షులు



ఎమ్మెల్యే అనంతను సన్మానిస్తున్న వివిధ విభాగాల అధ్యక్షులు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, మైనార్టీ విభాగం అధ్యక్షులు సైపుల్లా బేగ్‌లు ఆయనను కలిసి ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పటికీ తగిన గుర్తింపు ఇస్తారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం , డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మలోబిలేశుడి ఉత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్



కొండపై వెలసిన జంట కోనేర్లు

**ఆత్మకూరు:** మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు 1 నుంచి పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

**పురాతన ఆలయంగా ప్రసిద్ధి :**
మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయం శతాబ్దాల కాలం నాటిది. కొండపై జంట కోనేర్లు ఉన్నాయి. వేసవిలోనూ జంట కోనేర్లలో మాత్రం నీరు తగ్గదని స్థానిక పెద్దలు చెప్తుంటారు. జంట కోనేర్లో స్నానాలచరించి, భక్తులు దర్శనానికి వెళ్తుంటారు. 1 నుంచి ఉత్సవాలు ప్రారంభం : 1న వై.కొత్తపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పంపనూరు కొండపై ఉన్న ఆలయానికి ఉత్సవ విగ్రహాలకు మేళతాళాలతో తీసుకెళ్లి పూజలు చేస్తారు. 2న అభిషేకం, ధ్వజారోహణ, కలశస్థాపన, 3న నరసింహస్వామి మూలమంత్ర హవనము, అభిషేకం, కళశారాదన హోమం, 4న అభిషేకంతో పాటు సుదర్శన హోమం, 5న లక్ష్మీహోమం, గరుడోత్సవం , 6న స్వామి కల్యాణోత్సవం, 7న రథోత్సవం ,8న పరుష, పన్నేరపు బండ్ల ప్రదర్శన , 9 న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 'వెన్నపూస' గెలుపు.. అభివృద్ధికి మలుపు



ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, రవీంద్రారెడ్డి సతీమణి హరిత, గోవిందరెడ్డి

**రాప్తాడురూరల్:** వైఎస్సార్‌సీపీ బలపరిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు అని ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి అన్నారు. సోమవారం వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరితతో కలిసి ఉప్పరపల్లి, పూలకుంట, చియ్యేడు, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఆకుతోటపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సచివాలయాలు, పాఠశాలలకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. గ్రామాల్లో గ్రాడ్యుయేట్స్, స్థానిక సంస్థల ప్రతినిధులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించేలా చూడాలని కోరారు. రవీంద్రారెడ్డిని గెలిపించి అన్నివర్గాల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉప్పరపల్లి సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రవిశేఖర్‌రెడ్డి, చియ్యేడు ఉప సర్పంచ్ చెన్నయ్య, ఆకుతోటపల్లి ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, పూలకుంట భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

## నీటి సమస్యలు నివారిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్

**ఆత్మకూరు:** మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమలత, ఈవోఆర్డీ సత్యబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్‌తో కలసి నీటి సమస్యపై చర్చించారు. గ్రామాల్లో ఎక్కడైనా బోర్లు మరమ్మతుకు గురైంటే తెలుసుకొని వాటిని మరమ్మతు చేయించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య అన్న మాట వినపడకూడదన్నారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న చోట ట్యాంకర్లతో సరఫరా చేస్తామన్నారు. మండల కేంద్రంలో నీటి సరఫరా సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీటిసమస్య రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి శైలజారాణి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లు లేని పేదలను గుర్తించండి

**కనగానపల్లి:** నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల కోసం గ్రామాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ స్థానిక ప్రజాప్రతినిధులు, హౌసింగ్ సిబ్బందికి సూచించారు.సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో మూడోవిడత కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ సిబ్బందితో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తోందన్నారు. ఏఈ చిరంజీవి మాట్లాడుతూ మండలంలో మొదటి,రెండు విడతల కింద మంజూరైన 4 వేలు ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా, ప్రస్తుతం మూడో విడత కింద 1,700 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు గ్రామాల్లో అర్హులను గుర్తించేందుకు వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నలపరెడ్డి, బి.రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### చిరు ధాన్యాలసాగు లాభదాయకం

**బుక్కరాయసముద్రం:** చిరు ధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో చిరు ధాన్యాల పంటలను సాగు చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ.. రైతులు వర్మి కంపోస్ట్ ఎరువులు వాడాలన్నారు. వర్మి కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ,డాక్టర్ కిషోర్‌రెడ్డి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లపై ఫోకస్

- మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలు



మాసినేని గ్రాండ్ నిర్వాహకులకు పన్ను వసూలు పత్రం అందిస్తున్న దృశ్యం

**అనంతపురం క్రైం:** నగరంలో ఇంటి, నీటి పన్ను వసూళ్లపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలునిస్తోంది. దీంతో అధికారులు వందశాతం పన్నువసూలే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.
నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో 59,397 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇంటి పన్ను లక్ష్యం రూ.72.27 కోట్లు కాగా, ఇప్పటి వరకు నగరపాలక సంస్థ అధికారులు రూ.32.38 కోట్లు వసూలు చేశారు. దాదాపుగా 60 శాతం పైగా పన్ను వసూలు చేశారు. అదేవిధంగా నీటి పన్ను వసూళ్ల లక్ష్యంగా రూ.15.16 కోట్లు కాగా, రూ.3.09 కోట్లు వసూలు చేశారు. ఈ ఏడాది మార్చి 31లోపు సాధ్యమైనంత పన్ను వసూలు చేసే విధంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కమిషనర్ కే భాగ్యలక్ష్మి ఆదేశాలతో అదనపు కమిషనర్ రమణారెడ్డి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు (ఆర్‌ఓలు) సతీష్, సుజాత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు) మురళీ, వేణు, బాబు, పద్మావతి, 74 సచివాలయాల్లో అడ్మిన్, ప్లానింగ్, మహిళా పోలీసు, అమినిటీలు 74 బృందాలుగా ఏర్పడ్డారు. మొదటి 300 నుంచి 500 మొండి బకాయిపై ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మొండి బకాయిదారుల ఇళ్లకు బృందాలు వెళ్తున్నాయి. అక్కడ ఆటో ద్వారా పెద్ద సౌండ్ చేస్తూ బకాయిదారులు చెల్లించే వరకూ వదల్లేదు. పన్ను చెల్లించని పక్షంలో ప్రభుత్వ సేవల్లో కోత, నీటి సరఫరా బంద్ చేస్తారు.

**పన్ను చెల్లింపు కేంద్రాలు:**
ఇంటి, నీటి పన్ను చెల్లించేందుకు నగరపాలక సంస్థ పన్ను చెల్లింపు కేంద్రాలు ఏర్పాటు చేసింది. నగరపాలక సంస్థ, 64వ సచివాలయం రెండో రోడ్డు, 54వ సచివాలయం రాంనగర్ ఈసేవా, 17వ సచివాలయం పాతూరులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతాల్లో నగదు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ (ఫోన్‌పే, గూగుల్‌పే) చెల్లింపులకు అవకాశం కల్పించింది. ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ కూడా ఇస్తున్నారు. దీంతో పాటు వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లించే సదుపాయం ఉంది.

**రూ.30 లక్షల వసూలు:**
నగరంలోని వివిధ అసెస్‌మెంట్ల ద్వారా రూ.30 లక్షల వరకు సోమవారం పన్ను వసూలైంది. అందులో రాజురోడ్డులోని మాసినేని గ్రాండ్ యాజమాన్యం రూ.10 లక్షలు, రాంనగర్‌లోని ఓ వైద్యుడు రూ.6.83 లక్షలు చెల్లించారు.

### నగరాభివృద్ధికి సహకరించాలి

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి. అసెస్‌మెంట్‌దారులకు పన్ను చెల్లించడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నాం. మొండిబకాయిదారుల పట్ల కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం. మార్చి 31లోపు పన్ను చెల్లించండి.

– రమణారెడ్డి,
అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ

## ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**చెన్నేకొత్తపల్లి:** ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను ఉగాది పండుగ నాటికి పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు ఇళ్లను నాణ్యతగా నిర్మిస్తేనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్, ఎంపీపీ అంజలి, సింగిల్ విండో అధ్యక్షులు డోలారామ చంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ హరికుమార్, ఎంపీటీసీ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ

## టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై విచారణ చేస్తాం



టౌన్ ప్లానింగ్ ఆర్డీడీ దేవికుమారి

**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, ఇన్‌చార్జ్ టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీపై డీటీసీపీ నుంచి అధికారికంగా సమాచారం అందిన వెంటనే విచారణ చేస్తామని పట్టణ ప్రణాళిక రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దేవికుమారి పేర్కొన్నారు. ఈనెల 22న డీటీసీపీ నుంచి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ చేయాలని ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. దీనిపై సోమవారం 'సాక్షి'తో ఆమె మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పూర్తి అధికార బాధ్యతలు కమిషనర్‌కే ఉంటాయన్నారు. భవనాల అతిక్రమణలు, అనుమతిలేని నిర్మాణాలు, తదితర వాటిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, సూచనలు, సలహాలు అందజేస్తామని తెలిపారు.

**డైరీ ఆవిష్కరణ**
రాంనగర్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో సోమవారం ఈ ఏడాది టౌన్ ప్లానింగ్ విభాగం డైరీని ఆర్డీడీ దేవికుమారి ఆవిష్కరించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, పట్టణ ప్రణాళిక కార్యదర్శులు హాజరయ్యారు.

## ఎర్రిస్వామి తాతకు ప్రత్యేక పూజలు



ఎర్రిస్వామి తాత మూలవిరాట్

**రాప్తాడు:** అయ్యవారిపల్లిలో వెలసిన ఎర్రిస్వామితాత పరుషను పురస్కరించుకొని రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు గ్రామస్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, తుఫాన్ వాహనాలకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎర్రిస్వామి తాత, ఆలయం సమీపంలోని వినాయకుడు, గొటుకూరప్ప, రాముడు తదితర స్వాములకు పూజలు నిర్వహించారు. అయ్యవారిపల్లి కాల్వగొంచి నిర్వాహకుల ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు పంచ రత్నాలు నాటక ప్రదర్శన ఉంటుంది.

**నేడు ఉట్ల పరుష :** ఎర్రిస్వామితాత ఆలయం వద్ద మంగళవారం ఉట్ల పరుష జరుగుతుందని అయ్యవారిపల్లి కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం ఆలయం దగ్గర 4 గంటలకు ఉట్లపరుష జరుగుతుందన్నారు. ఉట్ల పరుషకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, స్వామికి మొక్కులు తీర్చుకుంటారు.

### రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం

**రాప్తాడు:** రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని సర్వేయర్ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని గాండ్లపర్తిలో సచివాలయంలో రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే గాండ్లపర్తి రెవెన్యూ గ్రామంలో 80 శాతం రీ సర్వే పూర్తయిందన్నారు. ఇంకా 20 శాతం మంది రైతులు రీసర్వేకు వస్తే వందశాతం రీసర్వే పూర్తి చేస్తామన్నారు. రీ సర్వేకు ప్రతి రైతూ సహకరించాలన్నారు. రెండు రోజుల్లో మిగిలిన రైతులందరూ తమ భూములకు సంబంధించిన డాక్యుమెంట్స్, భూమి వివరాలు చూపిస్తే రీసర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేఖా, శారద, విజయ్, గ్రామ సచివాలయ సర్వేయర్లు శ్రావణ్, సలీమ్, షేక్షావలి, ప్రతాప్, భాగ్య, శివకుమార్, నరేష్, అశోక్, అన్నారీ తదితరులు పాల్గొన్నారు.

### యూజీసీ నిబంధనలు అమలు చేయండి

**అనంతపురం:** జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు యూజీసీ నిబంధనల ప్రకారం జీతాలు చెల్లించాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్కేయూలో ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వివిధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు సరైన జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ నాయకులు మంజునాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులతో మాంటిస్సోరి కరస్పాండెంట్ సూర్యనారాయణ రెడ్డి

**అనంతపురం:** మాంటిస్సోరి గుత్తిరోడ్, సంగమేశ్వర నగర్ బ్రాంచ్‌ల విద్యార్థులు యూఐఈఓ ( యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్) పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. 3వ తరగతి గ్రీష్మ అంతర్జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు, ఆరో తరగతి సాయిశ్రీకర్ 38వ ర్యాంకు, విద్యాశ్రీ 43వ ర్యాంకు, పీ రూపేష్ చౌదరి 51వ ర్యాంకు, భవ్యశ్రీ 68వ ర్యాంకు, మొత్తం 111 ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ప్రదర్శనకు గాను బంగారు పతకాలు, నగదు బహుమతులు కైవసం చేసుకున్నారు. మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ సి. సూర్యనారాయణ రెడ్డి, పాఠశాల కార్యదర్శి కే మాధవి, ప్రిన్సిపాళ్లు ఎ.రమాదేవి, బి. పద్మావతి విద్యార్థులను అభినందించారు.

### కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

**అనంతపురం:** ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం డీఈఓ ఎం. సాయిరాంకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీ

**కనగానపల్లి:** మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక ఏపీఓ కార్యాలయం నుంచి సామాజిక తనిఖీ బృందం సభ్యులకు రికార్డులు అందించినట్లు ఆయన తెలిపారు.